నమస్తే తెలంగాణ

# వికారాబాద్

15 హైదరాబాద్, మంగళవారం 5 మార్చి 2024 VIKARABAD





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## 'ఉపాధి' కూలీలను పెంచండి

వికారాబాద్, మార్చి 4 : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, టీఏలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. గ్రామ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ యంత్రాంగం కూలీల సంఖ్యను పెంచుతూ పనులు చేయించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పిస్తూ ముందుకెళ్లాలని ఆదేశించారు. అనుకున్న అంచనా ప్రకారం కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. క్లస్టర్‌ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని గ్రామానికి ఉపయోగపడే పనులు చేపట్టాలని సూచించారు. గ్రామ పరిధిలో ఉండే చిన్న చిన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా పైప్ లీకేజీలుంటే మరమ్మతులు చేపట్టాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు, ఏఈలు , ఎంపీడీవోల ఆధ్వర్యంలో తాగునీటి సమస్యపై సమావేశాలు ఏర్పాటు చేసుకొని పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా ఎన్ఆర్ఈజీఎస్ పనుల ప్రగతిపై చర్చించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుధారాణి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, గ్రిడ్ ఈఈ చల్మారెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.



ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

- ఈ నెలాఖరుతో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- ఇప్పటివరకు 75.42 శాతం ఆస్తి పన్ను వసూలు
- రూ.9.69 కోట్లలో ఇప్పటి వరకు రూ.7.31 కోట్లు వసూలు
- మరో 25 రోజుల్లో మిగతా రూ.2.38 కోట్లు రాబట్టడంపై దృష్టి

# తుదిదశకు..

## ముమ్మరంగా ఆస్తి పన్ను వసూలు

వికారాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూలుపై జిల్లా పంచాయతీ అధికారులు దృష్టి పెట్టారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 25 రోజులు మాత్రమే గడువు ఉండడంతో వసూలు ప్రక్రియను ముమ్మరం చేశారు. ఏటా మార్చిలోనే మెజార్టీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లిస్తూ వస్తున్నారు కాబట్టి ఈ నెలాఖరులోగా వందశాతం ఆస్తి పన్ను వసూలవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్ను వసూలు చేసేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇప్పటివరకు 75.42 శాతం మేర ఆస్తి పన్ను వసూలుకాగా.. మిగతాది సైతం రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రూ.9.69 కోట్లలో ఇప్పటివరకు రూ.7.31 కోట్ల ఆస్తి పన్ను వసూలుకాగా, మరో రూ.2.38 కోట్ల పన్ను రావాల్సి ఉన్నది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నెలాఖరులోగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పన్ను వసూలు చేసేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఐదారేండ్లుగా ఆస్తి పన్ను వసూళ్లలో ఏటా లక్ష్యానికి అనుగుణంగా వసూలవుతున్నది. అయితే గతంలో మాదిరిగా కాకుండా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే ఆస్తి పన్ను వసూలు ప్రక్రియను ప్రారంభించారు. మరోవైపు ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శి ఉండేలా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించడం కూడా ఆస్తి పన్ను వసూళ్లు పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. వసూలైన రూ.7.31 కోట్లలో పన్నుల రూపంలో వచ్చినవి రూ.6.82 కోట్లు కాగా, నాన్ ట్యాక్స్ రూపంలో రూ.47.45 లక్షలు ఉన్నాయి. అన్ని మండలాల్లోనూ 60 శాతానికిపైగా వసూలుకావడం గమనార్హం. ధారూరు, కొడంగల్, వికారాబాద్ మండలాల్లో ఇప్పటివరకు అత్యధికంగా ఆస్తి పన్ను వసూలైంది.

**మండలాల వారీగా ఇప్పటివరకు వసూలైన ఆస్తి పన్ను..**

| మండలం | వసూలైంది |
|---|---|
| బంట్వారం | రూ.12.96 లక్షలు |
| బషీరాబాద్ | రూ.28.02 లక్షలు |
| బొంరాస్‌పేట | రూ.22.87 లక్షలు |
| ధారూరు | రూ.37.54 లక్షలు |
| దోమ | రూ.39.32 లక్షలు |
| దౌల్తాబాద్ | రూ.22.17 లక్షలు |
| కొడంగల్ | రూ.23.75 లక్షలు |
| కోట్‌పల్లి | రూ.21.50 లక్షలు |
| కులకచర్ల | రూ.56.58 లక్షలు |
| మర్పల్లి | రూ.51.03 లక్షలు |
| మోమిన్‌పేట | రూ.73.48 లక్షలు |
| నవాబుపేట | రూ.47.17 లక్షలు |
| పరిగి | రూ.46.35 లక్షలు |
| పెద్దేముల్ | రూ.35.28 లక్షలు |
| పూడూరు | రూ.68.87 లక్షలు |
| తాండూరు | రూ.80.26 లక్షలు |
| వికారాబాద్ | రూ.26.61 లక్షలు |
| యాలాల | రూ.37.40 లక్షలు |

**వందశాతం వసూలుకు చర్యలు..**

జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాం. దాదాపు 75 శాతం మేర ఆస్తి పన్ను వసూలైంది. మరో రూ.2.38 కోట్ల ఆస్తి పన్నును ఈ నెలాఖరులోగా రాబడుతాం. గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం.

-జయసుధ, డీపీవో





రాగన్నగూడ వార్డు కార్యాలయం

## నెగ్గేదెవరు?

**నేడు తుర్కయాంజాల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అవిశ్వాసంపై బల పరీక్ష..**

**ఆర్డీవో అనంతరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు రాగన్నగూడ వార్డు కార్యాలయంలో సమావేశం**

తుర్కయాంజాల్, మార్చి 4 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ వార్డు కార్యాలయంలో బలపరీక్ష జరుగనున్నది. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే మీటింగ్‌కు వైస్ చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గం కౌన్సిలర్లు హాజరవుతారా.. లేదా అన్న విషయంపై సందిగ్ధత నెలకొన్నది. ఇప్పటికే తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు విశ్వాస పరీక్షకు దూరంగా ఉంటారని తేల్చి చెప్పారు. వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు 16 మంది కౌన్సిలర్లు ఆమెకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానంలో నెగ్గాలంటే 16 మంది సభ్యులు మద్దతు అవసరం. అయితే కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు బల పరీక్షకు హాజరుకాకపోతే అవిశ్వాసం వీగిపోయి వైస్ చైర్మన్‌గా హరిత కొనసాగుతారు. అనుహ్యంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు హాజరై బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాస తీర్మానంలో పాల్గొంటే మాత్రం వైస్ చైర్‌పర్సన్ పదవిని కోల్పోయే అవకాశం ఉన్నది. బల పరీక్షకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉంటారని చైర్‌పర్సన్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా లేదా అనేది నేడు తేలనున్నది.

**ఉదయం 11 గంటలకు విశ్వాస పరీక్ష**

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితపై కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం ఉదయం 11 గంటలకు బల పరీక్ష నిర్వహిస్తాం. విశ్వాస పరీక్షలో నెగ్గాలంటే కనీసం 16 మంది సభ్యుల మద్దతు అవసరం. ఒకవేళ సభ్యులు తక్కువగా వస్తే అవిశ్వాసం వీగిపోతుంది. బల పరీక్ష సమయంలో ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం.

- అనంతరెడ్డి, ఆర్డీవో



# ఒక్కరోజు ముచ్చటేనా?

## ప్రహసనంగా జీరో బిల్లులు

**ఎన్నికల్ కోడ్ అంటూ రెండో తేదీ నుంచే సాధారణ బిల్లుల జారీ**

**రంగారెడ్డిలో జూన్ వరకు గృహజ్యోతి లేనట్లే**

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఆరు గ్యారెంటీల అమలు కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు అడుగడుగునా నిరాశే ఎదురవుతున్నది. 200 యూనిట్ల వరకు కరెంట్ బిల్లుల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆశించిన లబ్ధిదారులకు అది ఒక్కరోజు మురిపెంగానే మిగిలింది. సీఎం రేవంత్‌రెడ్డి అట్టహాసంగా గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించేందుకు జిల్లాలోని చేవెళ్లను ఎంపిక చేసుకున్నారు. తీరా.. మహబూబ్‌నగర్-రంగారెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ వచ్చిందంటూ.. ప్రభుత్వ ఖర్చుతో చేపట్టిన ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి వినియోగించుకున్నది. ఈ నేపథ్యంలో కోడ్ ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు జిల్లాలో పథకాన్ని ప్రారంభించకుండా ఉండాలి. కానీ ఒకటో తేదీన పలు ప్రాంతాల్లో జీరో బిల్లులను జారీ చేసి.. ఘనంగా ప్రచారం చేసుకున్నారు. అసలు ఎన్నికల కమిషన్ ఈ అంశంపై స్పందించకున్నా... మరుసటి రోజు నుంచే కోడ్ ఉందంటూ పథకాన్ని అటకెక్కించారు. ఒకవైపు ఎమ్మెల్సీ.. రేపోమాపో పార్లమెంటు ఎన్నికల కోడ్‌తో రంగారెడ్డి జిల్లా ప్రజలకు జూన్ దాకా పథకం అందే అవకాశాలే లేకుండా పోయాయి. రాష్ట్రవ్యాప్తంగా మిగతా జిల్లాలకు భిన్నంగా కోడ్ అమల్లో ఉన్న జిల్లాల్లోని లబ్ధిదారులు మూడు నెలల పాటు సాధారణ కరెంటు బిల్లులు కట్టాల్సిందే. దీనిపై ప్రభుత్వం మినహాయింపు ఇస్తుందా? లేదా? అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.



'గృహజ్యోతి' రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ప్రచారం కోసం నామమాత్రంగా గుప్పెడు మందికి జీరో బిల్లులను జారీ చేశారు.. ఆపై కోడ్ పేరిట పథకం అమలును నిలిపేశారు. సాధారణ బిల్లులను జారీ చేస్తూ ముక్కుపిండి చార్జీలను వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఈ పథకాన్నీ సీఎం రేవంత్‌రెడ్డి గత నెల 27న ప్రారంభించారు. తొలుత పథకం ప్రారంభానికి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్లను ఎంచుకున్నారు. గత నెల 26న నల్గొండ-మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ జారీ అయింది. దీంతో ప్రభుత్వం పథకం ప్రారంభ వేదికను సచివాలయానికి మార్చింది. చేవెళ్లలో చేసిన ఏర్పాట్లతో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను ఏర్పాటు చేసుకొని ప్రచారం చేసుకున్నది. అయితే ఎలాగూ జిల్లాలో కోడ్ అమల్లో ఉన్నందున టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో జీరో బిల్లుల జారీనే చేపట్టవద్దు. కానీ ఈ నెల 1న జిల్లాలోని అనేక చోట్ల మీటర్ రీడర్స్ వేలాది మందికి జీరో బిల్లులను జారీ చేశారు. వాటికి అట్టహాసంగా ప్రచారాన్ని కల్పించారు. కొన్నిచోట్ల ఉదయం 11 గంటల వరకు జీరో బిల్లులు జారీ చేసి, ఆ వెంటనే నిలిపివేశారు. ఇలా జీరో బిల్లుల జారీ అనేది కొన్నిచోట్ల సాయంత్రం వరకు కొనసాగింది.

### మరుసటిరోజే నిలిపివేత..

ఈ నెల 1న జీరో బిల్లులు జారీ చేసిన అధికారులు.. మరుసటి రోజు నుంచే దానిని నిలిపివేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున పథకం అమలు చేయొద్దంటూ అంతర్గతంగా ఆదేశాలు జారీ చేశారు. బయటికి ఎన్నికల కమిషన్ వద్దని చెప్పిందంటూ అధికారులు చెబుతున్నా... దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని ఎన్నికల కమిషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే షాద్‌నగర్ వంటి ప్రాంతాల్లోనైతే 1న ఉదయం 11 గంటల వరకు జీరో బిల్లులు జారీ చేసి.. ఆ వెంటనే దానిని నిలిపివేసి, జీరో బిల్లులు ఇచ్చిన వారికి తిరిగి సాధారణ బిల్లులు కూడా ఇచ్చారు. చేవెళ్లలోని షాబాద్ వంటి ప్రాంతాల్లో వందల మందికి జీరో బిల్లులు ఇచ్చి తదుపరి మీరు సాధారణ బిల్లులు చెల్లించాల్సిందేనని మీటర్ రీడర్లు లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలోనూ మొదటి రోజు జీరో బిల్లులు జారీ చేసి ఆపై నిలిపివేశారు. దీనిపై అధికారులను సంప్రదిస్తే.. ఏదో ట్రయల్ రన్ చేశామంటూ చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేయని ట్రయల్ రన్ ఇక్కడ మాత్రమే ఎందుకు చేశారనేది అధికారులకే తెలియాలి. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో జీరో బిల్లుల జారీకి యంత్రాలను తీసుకువచ్చి... ఆతర్వాత వాపస్ తీసుకుపోయారు. ఇలా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధుల్లో పథకం అమలు అనేది గందరగోళంగా మారింది.

### ప్రభుత్వం నుంచి భరోసా వచ్చేనా?

రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చింది. దీంతో ముమ్మందు పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ ఆన్‌గోయింగ్ పథకం అయినందున దానిని కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కోడ్ కారణంగా ప్రారంభించలేదు. ఈ నెలలోనే పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం ఖాయంగా కనిపిస్తున్నది. మే వరకు కోడ్ అమల్లో ఉండనున్నది. జూన్‌లో వచ్చే బిల్లుల సమయంలో మాత్రమే ఈ జిల్లాల వారికి పథకం అమలయ్యే అవకాశం ఉంది. అంటే మూడు నెలల పాటు అర్హులైన లక్షలాది మంది లబ్ధిదారులు సైతం సాధారణ కరెంటు బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మూడు నెలల పాటు బిల్లులు చెల్లించిన లబ్ధిదారులకు ప్రభుత్వం తదుపరి రీయింబర్స్ చేస్తుందా? లేదా మరో రకంగా సర్దుబాటు చేసి లబ్ధిదారులకు ఏమైనా భరోసా ఇస్తుందా? అనేది తెలియాల్సి ఉన్నది.

## అక్రమాల నిగ్గు తేల్చేందుకు.. హౌస్ కమిటీలు..




సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ): బల్దియాలో పారిశుధ్యం, ప్రకటన విభాగంలో అక్రమాలను నిగ్గు తేల్చేందుకు రెండు హౌస్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ప్రకటనల విభాగంలో కార్తిక్ ట్యాక్స్, అడ్డగోలు హోర్డింగ్‌లతో జీహెచ్ఎంసీ ఖజానాకు వందల కోట్లు గండిపడుతున్నదని గత నెల 19, 20వ తేదీల్లో జరిగిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. దీంతో పాటు పారిశుధ్య విభాగంలో అక్రమాలు, స్వీపింగ్ యంత్రాల వినియోగంలో అవినీతిపై కార్పొరేటర్లు ప్రశ్నించారు. ఈ రెండు అంశాలపై విస్తృతంగా చర్చించి.. భారీ స్థాయిలో అవినీతి ఆరోపణలు రావడంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రకటనలు, పారిశుధ్యంలో జరిగిన అక్రమాల నిగ్గు తేల్చేందుకు రెండు వేర్వేరు హౌస్ కమిటీలు వేస్తున్నట్లు ప్రకటించారు. వీటితో పాటు ప్రత్యేక విచారణ అధికారిని నియమించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు చొప్పున కార్పొరేటర్లను ఎంపిక చేసి రెండు హౌస్ కమిటీలు వేశారు. ఈ మేరకు బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ రెండు హౌస్ కమిటీల ఏర్పాటును ఆమోదించనున్నారు.

# ఇలా పోస్టింగ్.. అలా ట్రాన్స్‌ఫర్

**తరచూ స్థాన చలనం.. అధికారుల్లో అసహనం**

**శాంతిభద్రతలపై ప్రభావం పడొచ్చు**

**కొందరు అధికారుల ఆవేదన**

సిటీబ్యూరో: ఇలా పోస్టింగ్ ఇస్తున్నారో లేదో.. అలా బదిలీ జరిగిపోతున్నది. సిబ్బంది.. శ్రేయోభిలాషులు పూల బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపేలోపే మళ్లీ బదిలీ వేటు పడుతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖలో బదిలీల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నది. వరుస బదిలీలపై అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు కేవలం ఎన్నికల నియమావళి మేరకేనంటూ ఉన్నతాధికారులు చెబుతుంటే.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటున్నది. ఒక అధికారిని ఒక ప్రాంతానికి బదిలీ చేసిన మరుసటి రోజే తిరిగి ఆ ఉత్తర్వులు రద్దు చేయడం, స్థానచలనం అయిన అధికారిని అదే స్థానంలో పోస్టింగ్ కల్పించడం..ఇదేక్కడి ఎన్నికల నియమావళి అంటూ కొందరు అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం బదిలీలు చేస్తే.. సదరు అధికారికి సంబంధించిన పూర్తి వివరాల ఆధారంగానే పోస్టింగ్ కల్పిస్తారు. కానీ ఇప్పుడు జరుగుతున్న బదిలీల తంతులో ఒక అధికారిని ట్రాన్స్‌ఫర్ చేసి, కొత్త పోస్టింగ్ కల్పించిన వారం లోపే మళ్లీ స్థానచలనం చేయడం పలు విమర్శలకు తావిస్తున్నది.

### శాంతిభద్రతలపై ప్రభావం..?

కొత్త పోస్టింగ్‌లు తీసుకున్న ఏసీపీలు ఆ ప్రాంతంపై పట్టు సాధించే లోపే బదిలీకావడం వల్ల స్థానికంగా శాంతిభద్రతలు పట్టు తప్పే ప్రమాదం లేకపోలేదంటున్నారు సీనియర్ అధికారులు. ఎందుకంటే ఒక ప్రాంతంలో నాలుగు రోజులకు ఒక అధికారి మారడం వల్ల అక్కడి శాంతిభద్రతల పర్యవేక్షణ గాడి తప్పడమే కాకుండా వచ్చే కొత్త అధికారులకు ఏరియాపై అవగాహన, పట్టులేకపోతే నేరాలను నియంత్రించడం కష్టంగా మారే ప్రమాదం లేకపోలేదంటున్నారు నిపుణులు. అలాగే ఈ మధ్య ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి డీసీపీ స్థాయిల వరకు తరచూ బదిలీలు జరుగుతుండడంతో కేసుల దర్యాప్తు మందగిస్తుందనే విమర్శలున్నాయి.

### పలువురు అధికారుల అసంతృప్తి

ప్రస్తుతం జరుగుతున్న పోలీసు అధికారుల బదిలీలతో చాలా మంది అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా బదిలీలు చేయాలంటే సదరు అధికారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి బదిలీ చేయాలి. అంతే తప్ప నాలుగు రోజులకోసారి అధికారులను బదిలీ చేయడం, ఒకచోట నుంచి బదిలీ చేసిన అధికారికి తిరిగి మళ్లీ అదే చోట పోస్టింగ్ కల్పించడం వంటి వ్యవహారాలపై పలువురు అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.